# సింగిల్ పేజీ కథలు

## కొడుకులు

రామారావు, సీతలకి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. రామారావు ఒక ప్రయివేటు కంపెనీలో ఎకౌంటెంటుగా పనిచేసి ఎనిమిది నెలల క్రితం రిటైరయ్యాడు. రిటైరయ్యేనాటికి ఒక చిన్న ఇల్లు కట్టుకుందామని భార్య ఎంత పోరుపెట్టినా సంపాదించినదంతా కొడుకుల చదువులకే ఖర్చుపెట్టాడు రామారావు. ఫలితంగా పెద్దకొడుకు విజయవాడలోని గవర్నమెంటు కాలేజీలో లెక్చరర్ అయ్యాడు. చిన్నకొడుకు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరయ్యాడు. కొడుకులిద్దరూ వాళ్లకి నచ్చిన అమ్మాయిలను ప్రేమించి పెళ్లిళ్లు చేసుకున్నారు.

కూతురు లలితని కూడా బి.ఇడి చదివించాడు రామారావు. కానీ రిటైరయ్యేనాటికి ఆమె పెళ్లి చెయ్యాలని అనుకున్నా చెయ్యలేకపోయాడు. కూతురికి ఇప్పుడొక సంబంధం చూశాడు. అబ్బాయి జిల్లా పరిషత్ స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నాడు. అబ్బాయి తల్లిదండ్రులు లక్ష రూపాయలు కట్నం కావాలని అడిగారు. కట్నం బాధ్యత కొంచెం పంచుకోమని అడుగుదామని తన ఇద్దరు కొడుకులను రాజమండ్రి పిలిపించాడు రామారావు.

"లలితకి మంచి సంబంధం ఒకటి చూశాను. అబ్బాయి జిల్లా పరిషత్ స్కూలులో టీచర్. కాని, కట్నం లక్ష రూపాయలు అడుగుతున్నారు" అని చెప్పి, తాను అడగకుండానే కట్నం బాధ్యత పంచుకొంటామని ముందుకొస్తారేమోనని కొడుకుల వంక ఆశగా చూశాడు.

అలా జరగకపోవడంతో నిరాశపడ్డాడు. కాని అడగకుండా అమ్మయినా పెట్టదు అని మనసులో సర్దిచెప్పుకొని "నేను రిటైరయ్యి ఎనిమిది నెలలయ్యింది. ప్రస్తుతం రెండు షాపులలో ఎకౌంట్స్ రాస్తున్నాను. కాని ఆ షాపులవాళ్లిచ్చే డబ్బులు ఇంటి అద్దెకి, తిండికి బొటాబొటిగా సరిపోతున్నాయి. అందువల్ల కట్నం బాధ్యత మీరు కూడా పంచుకుంటే బాగుంటుంది" అని అడిగాడు.

"కూతురి పెళ్లి చెయ్యాలని తెలుసు కదా! అలాంటప్పుడు ముందస్తు ప్లానింగ్ లేకుండా పెళ్లి చేసేనాటికి చేతిలో డబ్బులు లేకుండా ఎలా వున్నారు?" కోపంగా అడిగాడు పెద్దకొడుకు.

"అమ్మకి వాళ్ల పుట్టింటి వాళ్లిచ్చిన ఎకరం పొలం వుందికదా! అది అమ్మేయండి" సలహా ఇచ్చాడు చిన్నకొడుకు.

"నేను వున్నన్నాళ్లూ ఏ షాపులోనో ఎకౌంట్స్ రాసి మీ అమ్మని పోషిస్తాను. కాని నేను పోయాక, ఆ పొలం కూడా లేకపోతే మీ అమ్మ ఎలా బ్రతుకుతుంది?" అన్నాడు రామారావు.



"సంపాదించిన డబ్బంతా మీ చదువుల కోసమే ఖర్చుపెట్టాను. ఒక చిన్న పాత ఇల్లయినా కొనమని మీ అమ్మ చెప్తుండేది. కాని ఇల్లు కొనడానికి అప్పు చేస్తే, ఆ అప్పు తీర్చడానికి వాయిదాలు కట్టాలి. నాకొచ్చే కొద్దిపాటి జీతంలో, వాయిదాలు కట్టగా మిగిలిన డబ్బు మీ ఫీజులకి, పుస్తకాలకి సరిపోదని ఇల్లు కూడా కొనలేదు. అటువంటి పరిస్థితులలో కూతురి పెళ్లి కోసం దాచడానికి డబ్బులెక్కడివి?" అన్నాడు రామారావు.

'అదేంటి నాన్నా అలా అంటారు. మేమిద్దరం అమ్మని పువ్వుల్లో పెట్టి చూసుకుంటాం' అని తన కొడుకులు అంటారని ఆశపడ్డాడు రామారావు. కొడుకుల మీద ఆయన నమ్మకం ఎంత గట్టిదంటే, తన కొడుకులు నిజంగానే ఆ మాటలు అనేట్లు అనిపించింది. కాని మరుక్షణంలోనే అది భ్రమ అని తెలిసింది. అయినా ఆశ చావక "మీరేమైనా అన్నారా?" అని ఆశగా కొడుకులని అడిగాడు.

ఏమీ అనలేదని వాళ్లు చెప్పడంతో ఆయన కళ్లలో

నీళ్లు గిర్రున తిరిగాయి. తండ్రి ముఖంలోకి చూడకుండానే మాట్లాడుతున్న కొడుకులు ఆ కన్నీళ్లని గుర్తించలేదు. కాని ముప్పయి సంవత్సరాలు ఆయనతో కాపురం చేసిన సీత, కొడుకుల మీద ఆయనకున్న నమ్మకపు పొరలు బ్రద్దలయ్యి బయటకి వస్తున్న ఆ కన్నీటిని వెంటనే గుర్తించి, కొడుకులతో కట్నం విషయం మాట్లాడే బాధ్యత తాను తీసుకొని "పొలం అమ్మడం కుదరదు. కట్నం బాధ్యత మీరెంత వరకు పంచుకోగలరో చెప్పండి" అని అడిగింది.

తన బాధ్యతని భార్య తీసుకోవడం గమనించిన రామారావు ఆ గది నుంచి బయటకి వెళ్లిపోయాడు.

"నేను చేసేది లెక్చరర్ ఉద్యోగం. లెక్చరర్ అంటే పెద్ద ఉద్యోగమేమీ కాదు. బడిపంతులు కంటే కొంచెం ఎక్కువ అంతే. బతకలేక బడిపంతులు అన్నట్లు నా జీతంతో నెల గడవడమే కష్టంగా వుంటోంది. అందువల్ల నేను కట్నం బాధ్యత పంచుకోలేను" అని చెప్పి ఆ గది నుంచి వెళ్లిపోయాడు పెద్ద కొడుకు.

"ఎంత పెద్ద ఉద్యోగం చేసినా, ఖర్చులుపోను నాకు మిగిలేదేమీ వుండదు. హైదరాబాద్‌లో ముప్పయి వేలు జీతం, మన రాజమండ్రిలో మూడు వేలతో సమానం. నాకు కూడా జీతం కటాకటిగా నెల ఖర్చులకి సరిపోతుంది. అందువల్ల నేను కూడా కట్నం బాధ్యత పంచుకోలేను" చెప్పాడు చిన్నకొడుకు.

"మీరిద్దరూ కట్నం బాధ్యత కొంచెం కూడా పంచుకోకపోతే లలిత పెళ్లి ఎలా చెయ్యగలుగుతాం?" విచారంగా అంది సీత.

ఒక నిముషం మౌనం తర్వాత "నాదగ్గర డబ్బులు లేకపోయినా నేను ఎవరో ఒకరి దగ్గర అప్పు చేసి యాభై వేలు ఇస్తాను. కాని నేను అడిగినప్పుడు తిరిగి ఇచ్చెయ్యాలి. వడ్డీ నేనే కడతాను. యాభై వేలు వెనక్కిస్తే చాలు" అన్నాడు చిన్నకొడుకు.

బాధ్యత పంచుకోమంటే యాభై వేలు అప్పుగా ఇస్తానన్నాడని బాధనిపించినా, కనీసం వడ్డీ ఇవ్వమని అడగలేదులే అని సంతోషించింది ఆ తల్లి మనసు.

"అలాగే ఇవ్వు. నీ అన్నయ్య కనీసం ఈపాటి సహాయం చెయ్యడానికి కూడా ముందుకురాలేదు. మిగిలిన యాభై వేలు మేమే ఎక్కడో ఒకచోట అప్పు చేసి లలిత పెళ్లి చేస్తాము" అంది.

* * *

ఆ విధంగా లలితకి పెళ్లిచేసి అత్తారింటికి పంపారు. నెలరోజుల తర్వాత చిన్నకొడుకు చెప్పాపెట్టకుండా వచ్చాడు. కూతురు అత్తారింటికి వెళ్లిన దగ్గర నుంచి ఒంటరిగా, దిగులుగా వుంటున్న ఆ తల్లిదండ్రులకి చిన్నకొడుకుని చూసేసరికి చాలా ఆనందం కలిగింది. గారెలు, బూరెలు వండి భోజనం సిద్ధం చేసింది సీత.

భోజనాలు చేస్తుండగా "నాకు నా యాభై వేలు అత్యవసరంగా కావాలి" అని చిన్నకొడుకు అడిగాడు.

"ఇంత అకస్మాత్తుగా అంత పెద్దమొత్తం ఎలా ఇవ్వగలను? నెలనెలా కొంత చొప్పున ఇస్తాను" అన్నాడు రామారావు.

"నాకు అప్పు ఇచ్చిన వడ్డీవ్యాపారి నాలుగు రోజుల్లో తన అప్పు వడ్డీతో సహా తీర్చమని అడిగాడు. హైదరాబాద్‌లో వడ్డీ వ్యాపారులు అప్పులు వసూలు చెయ్యడానికి రౌడీలని కూడా ఉపయోగిస్తారు. అందువల్ల ఎలాగైనాసరే ఆ యాభై వేలు రెండు మూడు రోజుల్లో ఇచ్చెయ్యండి."

"అంత పెద్ద ఉద్యోగం చేస్తున్న నువ్వే నాలుగు రోజుల్లో యాభై వేలు తేలేకపోతే, రిటైరయిన మీ నాన్నగారు ఎలా తెస్తారు?" అంది సీత.

"నిజమే. నాన్నగారు మాత్రం నాలుగు రోజుల్లో యాభై వేలు ఎలా తెస్తారు. కాని అప్పు తీర్చకపోతే ఆ వడ్డీవ్యాపారి నన్ను ఏం చేస్తాడోనని భయంగా వుంది. అందువల్ల పొలం అమ్మితే బాగుంటుంది."

"నాలుగు రోజుల్లో పొలం ఎలా అమ్మగలుగుతాం?" అన్నాడు రామారావు.

"ఆ ఎకరం పొలం అమ్మితే ఎంత వస్తుంది?" అడిగాడు చిన్నకొడుకు.

"ఎవరైనా వాళ్లకి వాళ్లు కొనడానికి వస్తే రెండులక్షల వరకు వస్తుంది. కాని మనం రెండుమూడు రోజుల్లో అమ్మాలని ప్రయత్నిస్తే లక్ష కంటే ఎక్కువ రాకపోవచ్చు" చెప్పింది సీత.

"అలాగయితే నా యాభై వేలకి బదులుగా అరెకరం పొలం నా పేరున రిజిస్టర్ చెయ్యండి" వెంటనే చెప్పాడు చిన్నకొడుకు.

తమ కొడుకుని ఆ వడ్డీవ్యాపారి ఏం చేస్తాడోననే భయంతో "మరి ఆ వడ్డీవ్యాపారికి అప్పెలా తీరుస్తావు?" అని ఒకేసారి అడగబోయారు ఆ తల్లిదండ్రులు.

కాని, లక్ష రూపాయలు విలువ చేసే అరెకరం పొలం, కేవలం యాభై వేలకే తన పేరున రిజిస్టర్ చేయించుకోడానికి తమ చిన్నకొడుకు పకడ్బందీగా వేసిన పథకం అర్థమయ్యేసరికి అలా అడగడం అనవసరం అనుకొని అడగలేదు. మరొక్కమాట కూడా మాట్లాడకుండా అరెకరం పొలం చిన్నకొడుకు పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించేశారు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే చిన్నకొడుకు హైదరాబాద్ వెళ్లిపోయాడు.

చిన్నకొడుకు వెళ్లిన రెండురోజులకి పెద్దకొడుకు వచ్చాడు. చిన్నకొడుకు చేసిన వంచన వల్ల మనసులు కలత చెంది వున్న ఆ తల్లిదండ్రులకి పెద్దకొడుకుని చూసేసరికి ప్రాణం లేచి వచ్చింది. పెద్దకొడుక్కి ఇష్టమైన పాయసం, పులిహోర చేసి, తండ్రీ కొడుకులకి భోజనం వడ్డించింది సీత.

చిన్నకొడుకు చేసిన వంచనని పెద్దకొడుకుతో చెప్పుకొని సేదతీరాలనుకొంది ఆ తల్లి మనసు. దానితో చిన్నకొడుకు యాభై వేలు ఇచ్చి అరెకరం పొలం తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయం పెద్దకొడుక్కి చెప్పింది.

తల్లి చెప్పిందంతా విని "అలా అరెకరం పొలం రాసిస్తారని తెలిస్తే ఎక్కడో ఒకచోట అప్పుచేసి నేను కూడా యాభై వేలు ఇచ్చుండేవాడిని కదా!" అన్నాడా పెద్దకొడుకు.

**-మొండెపు ప్రసాద్ (రాజమండ్రి)**




